
క్లుప్తంగా

బాలినేని, ఎస్పీని కలిసిన జంకె



బాలినేనిని సన్మానిస్తున్న జంకె

మార్కాపురం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎస్పీ మలికాగర్గ్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డితో జిల్లాలో పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై జంకె చర్చించినట్లు తెలిసింది. అనంతరం బాలినేనిని జంకె సన్మానించారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి



ఎస్పీ మలికాగర్గ్‌తో ఎమ్మెల్యే మద్దిశెట్టి, ప్రజాప్రతినిధులు

దర్శి టౌన్: కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ బుధవారం ఒంగోలులో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై, గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతుల నష్టపరిహారం పెంపుపై ఆయన కలెక్టర్‌తో చర్చించారు. తొలుత వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డితో కూడా ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఎమ్మెల్యేతో పాటు తాళ్లూరు, ముండ్లమూరు ఎంపీపీలు తాటికొండ శ్రీనివాసరావు, ఎస్ఎస్ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీలు మారం వెంకటరెడ్డి, రత్నరాజు, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వి.వెంకటరెడ్డి, బిజ్జం సుబ్బారెడ్డి, అంబటి వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

రేపు కంభంలో జాబ్‌మేళా

మార్కాపురం: కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, డీఆర్‌డీఏ, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 6వ తేదీన నిర్వహించే మెగా జాబ్ మేళాను గిద్దలూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. బుధవారం మార్కాపురంలోని తన నివాసంలో వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. వివరాలకు 86395 60207, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగుల చదువులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఒంగోలు అర్బన్: నలుగురు దివ్యాంగుల చదువులకు సూర్యశ్రీ ట్రస్ట్ ద్వారా రూ.90 వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ డీఈడీ చదువుతున్న ఎస్.బ్రహ్మారెడ్డికి రూ.30 వేలు, డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎం.నాగవాసుకు రూ.20 వేలు, బ్యాంకు పరీక్షలకు సంబంధించి కోచింగ్ తీసుకుంటున్న కె.రవి, టి.యోబుకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున అందజేశారు. ప్రవాస భారతీయుడు రేడియన్స్ గ్రూప్ క్యాపిటల్ చైర్మన్ పుసులూరి భాస్కర్ సహకారంతో ఆర్థికసాయం అందించినట్లు ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ బాషా వెల్లడించారు.

కోలాహలంగా పెన్షన్ల పంపిణీ

- కొత్తగా మంజూరైన వారికి అందజేత
- రూ.250 పెంచడంతో హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఒంగోలులో పెన్షన్లు పంపిణీ చేస్తున్న 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు

ఒంగోలు రూరల్: పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలను వరుసగా నాలుగో రోజు కూడా కోలాహలంగా నిర్వహించారు. ఈ నెల నుంచి కొత్తగా పెన్షన్ మంజూరైన వారికి అందించడంతో పాటు ఇప్పటికే తీసుకుంటున్న వారికి రూ.250 పెంచి రూ.2,750 చొప్పున అందిస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పెన్షన్ పంపిణీ వారోత్సవాల్లో ఒంగోలు నగర కమిషనర్, ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏటా పెన్షన్ల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందన్నారు. అందుకు ప్రజలందరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురవుతున్న పెన్షన్ పెంచడాన్ని ఆయన స్వాగతించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సోమశేఖర్, ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముక్తినూతలపాడులో...

పెన్షన్ పెంపుదల ప్రతి ఏటా చేపట్టడం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే చెల్లిందని ఆ పార్టీ ఒంగోలు మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య అన్నారు. ముక్తినూతలపాడు కూడలిలో బుధవారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్లు విజయశాంతి, విజయలక్ష్మి, సచివాలయ వెల్ఫేర్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



తక్కెళ్లపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న దుంపా చెంచిరెడ్డి

అల్లూరులో...

అల్లూరు (కొత్తపట్నం): అల్లూరు గ్రామంలోని రాజీవ్ కళామందిర్ ఆవరణలో బుధవారం నూతనంగా మంజూరైన వారికి పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికి మాత్రమే పింఛన్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ కావాలంటే అర్హులైతే చాలని, వెంటనే మంజూరు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 34 లక్షల మందికి పెన్షన్ ఇస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 64 లక్షల మందికి పెంచడం జరిగిందన్నారు. కరోనా కష్టకాలంలోనూ పింఛన్ పెంచడం జరిగిందన్నారు. మండలంలో కొత్త పింఛన్లు 240 మందికి రూ.2,750 చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలోని మడనూరు, మోటుమాల, కొత్తపట్నం, కె.పల్లెపాలెం, రంగాయపాలెం, గుండమాల, గమళ్లపాలెంలోనూ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, కో ఆప్షన్ మెంబర్ బాజీ, హరిబాబు, సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలోని గ్రామాల్లో...

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచిన పింఛన్లను సంతనూతలపాడు మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు బుధవారం పండుగ వాతావరణంలో పంపిణీ చేశారు. పీ తక్కెళ్లపాడు గ్రామంలో సర్పంచ్ ఆలూరి సుశీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. మొత్తం 204 మందికి పాత పింఛన్లు ఇవ్వగా, నూతనంగా ఐదుగురికి పింఛన్లు మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరి వెంకటేశ్వర్లు, బొడ్డపాటి చలపతిరావు, పెద బ్రహ్మయ్య, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎం.వేములపాడులో కొత్తగా 23 మందికి పింఛన్లు...

ఎం.వేములపాడు గ్రామంలో 416 మందికి పాత పింఛన్లు, 23 మందికి కొత్త పింఛన్లను సర్పంచ్ ఇర్లా విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ మండవ సులోచన ఆధ్వర్యంలో దుంపా చెంచిరెడ్డి, బీ విజయ, దుంపా రమణమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

పేర్నమిట్టలో...

ఒంగోలు 42వ డివిజన్ పరిధిలోని పేర్నమిట్టలో స్థానిక కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ చేతుల మీదుగా 426 మందికి పాత పింఛన్లు, ఏడుగురికి కొత్తగా పింఛన్లు పంపిణీ చేశారు. 40వ డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ చేతుల మీదుగా 25 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేసి అందించారు. ఆయా కార్యక్రమాలలో సచివాలయాల సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పెన్షన్ అందిస్తున్న ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ మలికార్జునరెడ్డి, ఎంపీడీవో



ముక్తినూతలపాడులో పెన్షన్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి అంకయ్య



అల్లూరులో పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు

షటిల్ కోర్టు ప్రారంభం

చీమకుర్తి: సంతనూతలపాడు ట్రాన్స్‌కో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి చేతుల మీదుగా బుధవారం రాత్రి ప్రారంభించారు. షటిల్ కోర్టు వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెంచిరెడ్డి అన్నారు.



షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న దుంపా చెంచిరెడ్డి

ఆపదలో ఆదుకున్న బాలినేని



హరిబాబు భార్య నాంచారమ్మకు రూ.2 లక్షల నగదు అందజేస్తున్న సర్పంచ్ ఆనంద్‌రావు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): మండలంలోని కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు పిన్ని హరిబాబు అనారోగ్యంతో గత నెలలో ఒంగోలు జీజీహెచ్‌లో చేరాడు. డాక్టర్లు పరీక్షలు చేసి ప్రైవేట్ వైద్యశాలకు తరలించాలని సూచించారు. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా గత నెల 28న కడుపులో గడ్డకు ఆపరేషన్ చేశారు. అనంతరం కడుపులో చీము చాలా ఎక్కువగా ఉండటంతో ఊపిరితిత్తులు, కిడ్నీలు పాడయ్యాయని, ప్రాణహాని ఉందని డాక్టర్లు చెప్పారు. మరో ఆపరేషన్ చేయాలని, చాలా ఖర్చవుతుందని తెలిపారు. బతికే అవకాశం కూడా చాలా తక్కువగా ఉందన్నారు. ఆపరేషన్ చేయాలని భార్య నాంచారమ్మ, కుటుంబ సభ్యులు తెలపడంతో ఆపరేషన్ చేశారు. హాస్పిటల్లో రూ.2.38 లక్షలు చెల్లించాల్సి ఉండగా, వారి వద్ద డబ్బు లేక సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావును సంప్రదించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లగా, బాలినేని స్పందించి రూ.2 లక్షల నగదును సర్పంచ్ ద్వారా అందజేశారు. ఆపదలో ఉన్న తమను ఆదుకున్న బాలినేనికి బాధితుడు, కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫెస్ట్ సర్వే లెన్స్ పరిశీలన



కొత్తపట్నంలో వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కొత్తపట్నం: కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫెస్ట్ సర్వే లెన్స్ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫెస్ట్ సర్వే లెన్స్ ఎలా చేస్తున్నారని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతి వారం నలుగురు రైతులు వేరు వేరు రైతుల పొలాలలో పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు, పంటకు హాని కలిగించే శత్రు పురుగులు, తెగుళ్లు, మొక్క, ఆరోగ్య స్థితిని పరిశీలించి రాష్ట్ర కార్యాలయం వారు నిర్దేశించిన ఫార్మేట్‌లో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వరి పైరును పరిశీలించారు. చీడపీడలు, తెగుళ్లను పరిశీలించి నివారణ మార్గాలను తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ రమేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సాఫ్ట్‌వేర్ సంస్థ ఎండీ సాయం



బ్యాట్ అందిస్తున్న ప్రియ

ఒంగోలు: స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలుడు సుమిత్ అండర్–14 సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. కానీ, కనీసం బ్యాట్ కూడా లేని దుస్థితిలో ఉండటంతో సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఏజే సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియ రూ.6 వేల విలువైన బ్యాట్ బహూకరించారు. బ్యాట్ అందుకున్న వెంటనే విజయవాడ మూలపాడులో గోకరాజు గంగరాజు స్టేడియంలో అండర్–14 క్రికెట్ పోటీలకు సుమిత్ బయలుదేరి వెళ్లాడు. ప్రియను వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి అభినందించారు.

డెయిరీ ఆవిష్కరించిన మేయర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ గంగాడ సుజాత, అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఆర్అండ్‌బీ వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర డెయిరీ, క్యాలెండర్లను ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్ అండ్ మున్సిపల్ ఎంప్లాయీస్ స్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు శరత్‌బాబు, ఆర్అండ్‌బీ ఎస్ఈ కే విజయరత్నం, స్థానిక కార్పొరేటర్ జడా వెంకటేష్, అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈవీఎం శరత్‌బాబు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ కే శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కే జాకీర్ హుస్సేన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ వెంకటేశ్వరరావు (వెంకట్), జిల్లా ట్రెజరర్ బి.వాలేశ్వరరావు, కార్పొరేటర్లు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో సంతనూతలపాడు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన క్రీడాకారిణులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారిణులు హాసిని, వర్షిత, అమూల్య రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. గత నెల 27న అనంతపురం కదిరిలో అండర్–14 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజయం సాధించారు. ప్రకాశం జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మంచి నైపుణ్యాలు ప్రదర్శించారని హెచ్ఎం రామారావు, పీడీలు మల్లికారాణి, శ్రీనివాసరెడ్డి అభినందించారు. వీరి ముగ్గురులో హాసిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, హెచ్ఎం రవి

చీమకుర్తి: చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ప్రధానోపాధ్యాయులు టీ రవి చేతుల మీదుగా బుధవారం ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆర్థిక సహకారంతో స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా చల్లా అంకులు, హెచ్ఎం మాట్లాడుతూ దాతలు అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సంపాదనలో 10 శాతం సేవా కార్యక్రమాలకు

చీమకుర్తి: తాను సంపాదించిన ఆదాయంలో 10 శాతం సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తానని రియల్ ఎస్టేట్ వ్యాపారి పూనాటి వెంకట్రావు తెలిపారు. బుధవారం చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగు నెలలుగా పనిచేస్తున్న ఇద్దరు డైట్ టీచర్లు విజయ, సుస్మితలకు రూ.20 వేల నగదును గౌరవ వేతనంగా ఆయన అందించారు. నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాల కావడంతో టీచర్ల కొరత కారణంగా డైట్‌లో కోర్సు పూర్తి చేసిన ఇద్దరు టీచర్లు నాలుగు నెలలుగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనలో తోడ్పడ్డారు. ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు పూనాటి వెంకట్రావు డైట్ టీచర్లకు గౌరవ వేతనం అందించారు. దాంతో పాటు పాఠశాలలోని విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లకు నగదును కూడా వెంకట్రావు చెల్లించారు. ఆయా బస్‌పాస్‌లను ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో గురవయ్య, హరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆభరణాలు బహూకరణ

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె సమీపం భీమలింగేశ్వరస్వామి ఆలయంలోని స్వామి వారికి బుధవారం వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ మాగులూరి శ్రీకాంత్ వెండి ఆభరణాల కోసం నగదును ఆలయ కమిటీ నిర్వాహకులు నాగసంకరుడికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను పలువురు సన్మానిస్తూ ప్రత్యేకంగా అభినందించారు. వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ కందగంట్ల వెంకటరమణ, జోన్ చైర్మన్లు పుల్లయ్య, రాజేశ్వరి, యూత్ క్లబ్ ప్రెసిడెంట్ సూరె నాగేశ్వరరావు, వనిత క్లబ్ ప్రెసిడెంట్ శేగు పద్మావతి, మాజీ డిప్యూటీ డీఈఓ కాశీశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పీడీ మల్లిక ప్రతిభ



పీడీ మల్లికను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చీమకుర్తి: మండలంలోని గోనుగుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పీడీ మల్లిక 30 ప్లస్ విభాగంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 5 ఈవెంట్లలో ప్రతిభ చాటి 5 పతకాలు సాధించారు. గత డిసెంబర్ నెలలో నెల్లూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మల్లిక పాల్గొన్నారు. 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, 400 మీటర్లు, 1600 మీటర్లు విభాగాలలో తృతీయ స్థానాల్లో నిలిచారు. లాంగ్ జంప్‌లో రెండో స్థానం సాధించారు. 5 ఈవెంట్లలో ప్రతిభ చాటిన పీడీ మల్లిక బుధవారం ఒంగోలులో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించి ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ప్రోత్సహించారు.